


# వీడని మిస్టరీ!

- కొలిక్కిరాని శ్రీధర్‌రెడ్డి హత్య కేసు..
- హంతకుల కోసం గాలింపు
- విచారణ చేస్తున్న పోలీసులు
- రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం
- భయం గుప్పిట్లో లక్ష్మీపల్లి వాసులు
- చీకటి పడితే చాలు ఇండ్ల తలుపులు మూత

వనపర్తి, మే 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర స్థాయిలో సంచనలం సృష్టించిన బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగి రెండ్రోజులైనా నిందితుల ఆచూకీ మాత్రం లభించడం లేదు. చిన్నంబావి మండలం లక్ష్మీపల్లికి చెందిన శ్రీధర్‌రెడ్డి రాజకీయంగా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడు కావడంతో హత్యకు ప్రాధాన్యత చేకూరింది. ఈ ఘటనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించడంతో రాష్ట్రస్థాయిలో సంచలనమైంది. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఈ హత్యతోపాటు ఇటీవల ఐదునెలల కాలంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై చోటుచేసుకున్న వరుస ఘటనలను కేటీఆర్‌తోపాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ ఏకరువు పెట్టారు. ఇంతకాలం ప్రశాంతంగా ఉన్న నియోజకవర్గంలో అధికార పార్టీ ముసుగులో ఏం చేస్తున్నారంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపల్లి ఘటన అధికార పార్టీని ఇరకాటంలో పడేసినట్లైంది. దీంతో తమపై వచ్చిన ఆరోపణలను మంత్రి జూపల్లి సైతం తిప్పికొట్టే ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం(గాంధీభవన్)లో ప్రెస్‌మీట్ పెట్టిన అనంతరం మరో టీవీ చానల్‌లో డిబేట్ కొనసాగించి హత్యతో తమకు ఎలాంటి సంబంధం లేదంటూ చెప్పుకొచ్చారు. ఇలా అధికార, ప్రతిపక్ష నాయకుల సవాళ్లు.. ప్రతి సవాళ్లతో లక్ష్మీపల్లి మర్డర్ కేసు మరింత వేడిని పుట్టిస్తున్నది.

### పోలీసుల విచారణ..

శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో పోలీసులు విచారణ జరుపుతున్నారు. హత్య జరిగిన తెల్లారి లక్ష్మీపల్లికి చేరుకున్న పోలీసులకు హత్యకు సంబంధించిన క్లూస్ లభించక పోవడంతో విచారణకు అధిక సమయం తీసుకుంటున్నది. హత్య జరిగి రెండు రోజులు కావడం.. రాజకీయంగా పెను దుమారం లేవడంతో పోలీసులకు ఈ మర్డర్ సవాల్‌గా నిలుస్తున్నది. హత్య జరిగిన స్థలంలో హంతకుల ఆనవా ళ్లు, డాగ్ స్క్వాడ్ ద్వారా బలమైన ఆధారాలు లభిం చకపోవడంతో దర్యాప్తు చేపట్టడం పోలీసులకు మరింత కష్టమవుతున్నది. ఇప్పటి వరకు శ్రీధర్‌రెడ్డి హితులు.. సన్నిహితుల ద్వారా వివరాలు సేకరిస్తు న్న పోలీసులు, మర్డర్‌లో నిజానిజాలను తేల్చేందుకు రెండు, మూడు కోణాల్లో దర్యాప్తును ముమ్మరం చేశారు. ఇప్పటివరకు పర్సనల్ విషయాలు, ఆర్థిక లావాదేవీలపైన దర్యాప్తు చేస్తుండగా.. రాజకీయ కోణంలోనూ దర్యాప్తును వేగవంతం చేస్తున్నట్లు తెలిసింది. హత్య జరిగిన మరుసటి రోజు వనపర్తి ఎస్పీ రక్షితామూర్తి ఘటనా స్థలాన్ని పరిశీలించి హత్యకు సంబంధించిన వివరాలపై సిబ్బందితో ఆరా తీశారు. పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి దర్యాప్తును వేగవంతం చేసినప్పటికీ నిందితుల జాడ తెలియడం లేదు. కాగా..శ్రీధర్‌రెడ్డి హత్యలో భూతగాదాలు, ఇతర విషయాలంటూ వచ్చిన ఆరోపణలను శ్రీధర్‌రెడ్డి కుటుంబం ముక్తకంఠంతో ఖండిస్తున్నది. కేసును తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నాయకులు అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని వారు మండిపడుతున్నారు.

### భయం గుప్పిట్లో లక్ష్మీపల్లి..

లక్ష్మీపల్లి గ్రామం ఇంకా భయం గుప్పిట్లోనే ఉన్నది. అత్యంత సౌమ్యుడిగా పేరున్న శ్రీధర్‌రెడ్డి దారుణ హత్యను గ్రామస్తులు జీర్ణించుకోవడం లేదు. ఈ ఉదంతంతో ఆ ఊరి ప్రజలు భయం నీడలో బతుకును వెల్లదీస్తున్నారు. చీకటి పడీ పడకముందే ఇండ్లన్నీ మూతపడుతున్నాయి. ఆరుబయట ఎవరూ నిద్రించడం లేదు. పోలీసులు మఫ్టీలో గ్రామానికి వచ్చి వెళ్తున్నా వారిని ప్రజలు పట్టించుకోవడం లేదు. ఏదేమైనా శ్రీధర్‌రెడ్డి హంతకులు పట్టుబడితేనే ఉద్రిక్తతకు తెరపడనున్నది. అయితే ఈ హత్య ఘటనను అన్ని కోణాల్లో సీ ఐ నాగభూషణ్‌రావు ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.



లక్ష్మీపల్లిలో పహారా కాస్తున్న పోలీసులు

# బాలికతో వ్యక్తి అసభ్యకర ప్రవర్తన

- దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన కుటుంబీకులు
- నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో ఘటన

నాగర్‌కర్నూల్, మే 25 : బాలికపై ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించగా కుటుంబసభ్యులు, ఆసుపత్రి సిబ్బంది దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానలో చోటు చేసుకున్నది. తెలకపల్లి మండలానికి చెందిన ఓ గర్భిణి ప్రసవం కోసం గురువారం రాత్రి జిల్లా దవాఖానలో చేరింది. ఆమె వెంట భర్తతోపాటు 14ఏండ్ల కూతురు వచ్చింది. డెలివరీకి సమయం ఉండడంతో తండ్రితోపాటు పక్కనే కూతురు నిద్రిస్తున్నది. ఈ సమయంలో నాగర్‌కర్నూల్ మండలం గగ్గలపల్లికి చెందిన బాబు(42) అసభ్యంగా ప్రవర్తించడంతో బాలిక కేకలు వేయగా తండ్రితోపాటు చుట్టుపక్కలవారు, దవాఖాన సిబ్బంది అతడికి దేహశుద్ధి చేశారు. 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెబుతుండగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



అచ్చంపేట రూరల్: ఈదురు గాలులకు ధ్వంసమైన శ్రీలలితా ఉమామహేశ్వరి జిన్నింగ్ మిల్లు రేకులు



ఉప్పునుంతల: రాయిచేడ్‌లో ఈదురుగాలులకు ఎగిరిపోయిన కోళ్లఫారం పైకప్పు రేకులు

# వరుణాగ్రహం.. అతలాకుతలం

- ఉమ్మడి జిల్లాలో ఈదురుగాలుల బీభత్సం
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు
- పలు చోట్ల దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు
- పిడుగుపాటుకు రైతు, పశువులు మృతి

అయిజ/మల్దకల్/అచ్చంపేట రూరల్/ ఉప్పునుంతల/వెల్దండ, మే 25 : అయిజ పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురు గాలులు వీయడంతో విద్యుత్‌శాఖకు తీవ్ర నష్టం వాటిల్లింది. దాదాపు 50 విద్యుత్ స్తంభాలు, నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకొరిగాయి. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం రాత్రి వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అచ్చంపేట మండలంలోని చెన్నారం, హాజీపూర్, రాయిచేడు, సింగారం పరిసర గ్రామాల్లో శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులకు వందలాది విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకూలాయి. చెన్నారంలోని శ్రీలలితా ఉమామహేశ్వరి జిన్నింగ్ మిల్లులో రాఫ్టర్లు, రేకులు ధ్వంసమై తీవ్ర నష్టం వాటిల్లినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యుత్ స్తంభాలు విరిగిపడడంతో శుక్రవారం రాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మల్దకల్ మండలం కుర్తిరావుల చెర్వులో శుక్రవారం రాత్రి పిడుగుపడి సూర్యగౌడ్‌కు చెందిన ఆవు మృతి చెందింది. మల్దకల్ మండలకేంద్రంలోని బ్రహ్మంగారి ఆలయం వద్దనున్న కానుగ చెట్టు రోడ్డుపై పడడంతో ఆ ప్రాంతంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పునుంతల మండలంలోని రాయిచేడ్, ఫిరాట్వాన్‌పల్లి, సూర్యతండాల్లోనూ విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతోపాటు కోళ్ల షెడ్లు, ఇంటిపై వేసుకున్న రేకులు ఎగిరిపోయాయి. వెల్దండ మండలం చొక్కన్నపల్లిలో రైతు చంద్రారెడ్డికి చెందిన కాడెద్దు వ్యవసాయ పొలం వద్ద కట్టేసి ఉండగా పిడుగుపాటుతో మృతి చెందింది. అదే విధంగా భారీ ఈదురుగాలులకు రాచూర్, పెద్దాపూర్ తదితర గ్రామా ల్లో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి.

### 5.6మి.మీల వర్షపాతం నమోదు

గట్టు, మే 25 : మండల కేంద్రంలో శనివారం 5.6 మి.మీ.ల వర్షపాతం నమోదైందని ఏఎస్‌వో శ్రీ నివాసులు తెలిపారు. కాగా ఇంతకు ముందు కురిసిన భారీ వర్షానికి తోడు ఇప్పుడు ఓ మోస్తరు వర్షం కురవడంతో పదును అలాగే ఉండిపోనున్నదని రైతులు తెలిపారు.



అచ్చంపేట రూరల్: డ్యామేజ్ అయిన సింగారం ఫీడర్



అయిజ శివారులో ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన స్తంభం



మల్దకల్‌లో రోడ్డుపై విరిగిపడిన కానుగచెట్టు

## పిడుగుపాటుకు రైతు మృతి

మక్తల్ టౌన్, మే 25 : పిడుగు పడి రైతు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లాలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు.. మక్తల్ మండలం మంతన్‌గోడ్ గ్రామానికి చెందిన రైతు కురుమూర్తి (42) తన పొలం వద్దకు శుక్రవారం ఉదయం వెళ్లాడు. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా వీచిన ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ సమయంలో పొలం వద్ద పిడుగు పడింది. పిడుగుపాటుకు గురై రైతు మృతి చెందాడు. పొద్దు పోయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు.



కురుమూర్తి (ఫైల్)


